పటాన్‌చెరుకు మరో గురుకులం

- రూ.200 కోట్ల నిధులు మంజూరు
- విద్యారంగంలో మరింత ముందుకు

పటాన్‌చెరు: నియోజకవర్గంలో ఇప్పటికే మూడు గురుకుల పాఠశాలలు, మూడు మోడల్ స్కూళ్లు ఉండగా తాజాగా మరో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు కానుంది. 25 ఎకరాల విస్తీర్ణంలో తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నారు. అమీన్‌పూర్ పట్టణంలో సర్వే నంబర్ 993లో పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్రం మొత్తంలో 100 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రారంభించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అన్ని వర్గాల పిల్లలకు నాణ్యమైన బోధన అందించాలని లక్ష్యంతో ఈ పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీఓలో రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 20 పాఠశాల నిర్మాణానికి నాలుగు వేల కోట్లు మంజూరు చేసింది. అమీన్‌పూర్‌లో నిర్మించ తలపెట్టిన పాఠశాల కోసం రూ.2 వందల కోట్లు మంజూరు చేశారు. పాఠశాలకు స్థలం కేటాయింపు ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే. స్థల సేకరణ పాఠశాల నిర్మాణానికి అనువైన పరిస్థితులు ఉన్నాయా లేవా అన్న విషయంపై రాష్ట్ర విద్యాశాఖా అధికారులు ఇదివరకే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఇస్నాపూర్, చిట్కూలలో రెండు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. జిన్నారంలో ఎస్టీ గురుకుల పాఠశాల ఉంది. రామచంద్రపురంలో మోడల్ పాఠశాలలు ఉన్నాయి. తాజాగా అమీన్‌పూర్‌లో పాఠశాల ఏర్పాటు కావడంతో ఈ ప్రాంతంలో విద్యారంగంలో మరింత అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. మహానగరానికి దగ్గరగా ఉండటం.. దేశంలోనే అన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడ స్థిరపడటంతో నియోజకవర్గం ఎంత గొప్పగా అభివృద్ధి చెందింది. అయితే జిల్లా ప్రజలు ఎవరైనా సులువుగా రాకపోకలు సాగించేందుకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం కూడా నవోదయ పాఠశాలను ఇక్కడ ఏర్పాటు చేయనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు (ఫైల్)

ఎమ్మెల్యే హర్షం...

అమీన్‌పూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు కావడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఏర్పాటుకు తన వంతు కృషి చేసినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పునరుద్ఘాటించారు.

అవసరం మేరకు విత్తనాల అందజేత



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ, పీఏసీఎస్ చైర్మన్

న్యాల్‌కల్(జహీరాబాద్): రైతులకు విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్‌వర్మ, న్యాల్‌కల్, హద్నూర్ పీఏసీఎస్ చైర్మన్లు సిద్దిలింగయ్యస్వామి, జగనాథ్‌రెడ్డి అన్నారు. మండలానికి 129.60 క్వింటాళ్ల జనుము విత్తనాలు వచ్చాయి. వాటిని బుధవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల అవసరం మేరకు విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు. విత్తనాలను ఎక్కడ పడితే అక్కడ కొనుగోలు చేయొద్దని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు సూచించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఏవైనా అనుమానాలుంటే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సాయిలు, రైతులు పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్ పర్యటన



వరద కాల్వను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలో బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. పట్టణంలో ప్రధాన రహదారులపై వర్షం నీరు నిల్వడంతో బుధవారం ఆ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. వరదనీరు నిలవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వరద కాల్వల్లో మట్టి నిండి పోవడాన్ని గమనించి వెంటనే కాల్వ విస్తీరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే అధికారులు జేసీబీ సాయంలో కాల్వలను శుభ్రం చేశారు. దీంతో వరద నీరు పోవడంతో రహదారులన్నీ పరిశుభ్రంగా మారాయి. సమస్యను సకాలంలో పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

టీబీ నిర్మూలనకు చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): టీబీ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని న్యాల్‌కల్ పీహెచ్‌సీ వైద్యుడు అమృత్ రాజ్ అన్నారు. నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆస్పత్రిలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని నిర్మూలించేందుకు అన్ని గ్రామాల్లో టీబీ పరీక్షలు నిర్వహించామన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడడం వల్ల వ్యాధి బారిన నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మార్త, ల్యాబ్ టెక్నీషియన్ మాణయ్య, ఫార్మసిస్టు విష్ణువర్ధన్ రెడ్డి, గోపిరాజ్, మంజుల, లక్ష్మి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



టీబీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న అమృత్‌రాజ్

మాజీ సైనికులకు సన్మానం

జోగిపేట(అందోల్): మండల విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అందోల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి ప్రేమ్‌కుమార్, యం మనోహర్ ప్రసాద్ మాట్లాడుతూ.. సైనికుల సేవలు వెలకట్టలేమన్నారు. యుద్ధ సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా వారు చేసే పోరాటం మరువలేనిదన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌కు అర్థమయ్యేలా 'ఆపరేషన్ సింధూర్'తో సమాధానం చెప్పిందన్నారు. లక్ష్మీనారాయణ, రత్నం, దుర్గయ్య, నాగభూషణం, సంతోష్‌కుమార్ రవీందర్, విశ్రాంత ఉద్యోగుల మండల కార్యవర్గ సభ్యులు శంకరప్ప, వెంకటేశం, రాజయ్య, కె సదాశివగౌడ్, వీరేశం, నవీన్‌కుమార్‌గౌడ్, శ్రీరాములు, పాండురంగం, భూమయ్య, అంజయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కబ్జా ఫిర్యాదుపై విచారణ

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో సర్వే నంబర్ 1000 ప్రభుత్వ భూమిలో కబ్జా జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఇన్వెస్టిగేటివ్ డైరెక్టర్ వెంకట్‌రావు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. హెచ్‌ఆర్ సీపీసీ ట్రస్ట్ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. స్థానిక రెవెన్యూ అధికారులు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు వేశారని, ఇతర కబ్జాలు జరిగాయని ట్రస్ట్ తరపున న్యాయవాది ఇంద్రజ లోకాయుక్త డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జీలుగ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ

కల్హేర్(నారాయణఖేడ్): రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ వెంకటేశం తెలిపారు. బుధవారం కల్హేర్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు సంతోష, కృష్ణవేణి, మాజీ సర్పంచ్ గోపాల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌శెట్టి, కాంగ్రెస్ నాయకులు దేవదాస్, తుకారాం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల చుట్టూ వరదనీరు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షం కురిసినప్పుడల్లా వరదనీరు ఇళ్ల మధ్యలో చేరి చెరువులను తలస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో డ్రైనేజీ పైపులైన్ పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల కాలనీ పైభాగంలోని వరదనీరు ఇళ్లల్లోకి చేరుతోంది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండడంతో దోమలు, ఈగల వ్యాప్తి చెంది చిన్నారులకు ఆనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. సమస్యను పలు మార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వర్షం నీటిలో ఆడుకుంటున్న చిన్నారి

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్‌రావు కాలనీలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మురుగుకాల్వల్లో మురుగు తొలగించడం వీధులు, రహదారులను శుభ్రం చేసే పనులు కొనసాగిస్తున్నామన్నారు. ఇళ్లు, దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో పోగైన చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేసి చెత్త సేకరణకు ఆటోల్లో వేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటరీ అధికారి శ్రీనివాస్‌ను ఆదేశించారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జగ్జీవన్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ, ఏఈఓ



నారాయణఖేడ్: దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ

కంగ్టి(నారాయణఖేడ్): ఖరీఫ్‌లో పత్తి, కందులు, సోయా విత్తనాల కోసం రైతులు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. బుధవారం వ్యవసాయ, పోలీసుశాఖ సమన్వయంతో దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కంగ్టి మండలంలోని పలు దుకాణాల్లో ఎస్ఐ సిద్ధదుర్గారెడ్డి సిబ్బందితో కలిసి ఏఈఓ గాండ్ల సంతోష్ పత్తి విత్తనాలు తయారీ సంస్థలు, తయారు చేసిన తేదీ, జన్యుపరమైన నాణ్యత నంబర్ తదితర అంశాలను పరిశీలించారు. తెలంగాణ కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలు అమ్మినా, స్టాక్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, గ్లైసిల్ విత్తనాలు అమ్మినా కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులు విత్తనాల కొనుగోలు చేసిన బిల్లులు తీసుకొని పంటకాలం పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచాలని సూచించారు.

నాగల్‌గిద్ద మండలంలో..

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ చారి, నాగల్‌గిద్ద ఎస్ఐ సాయిలు కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విత్తన డీలర్ల లైసెన్సులు, రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించారు. ఎవరైనా నాసిరకం విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు విక్రయించినా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోళ్లు చేసిన బిల్లులు తీసుకోవాలని సూచించారు.

జహీరాబాద్ పట్టణంలో..

జహీరాబాద్: పట్టణంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం పట్టణంలోని సాయిరాం, హుగ్గెల్లిలోని ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారి లావణ్య, టౌన్, రూరల్ ఎస్ఐలు కాశీనాథ్, సుజితలు సందర్శించి స్టాక్ వివరాలు సేకరించారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలనే అందించాలని డీలర్లకు సూచించారు.

హత్నూర మండలంలో..

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని ఎరువులు విత్తనాల దుకాణాలను ఎస్సై శ్రీధర్ రెడ్డి , ఏఓ శ్రీనివాస్‌లు బుధవారం తనిఖీలు చేశారు. ఎరువులు, విత్తనాల నాణ్యతను పరిశీలించారు. విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదు పొందాల్సి ఉందని తెలిపారు.

రూ.60లక్షలతో అదనపు తరగతి గదులు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.60 లక్షల నిధులతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ముత్తంగిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు గతంలో తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. అమెరికాకు చెందిన మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.60 లక్షలతో తరగతి గదులు నిర్మించేందుకు ముందుకు అన్నారు. త్వరలో పనులు ప్రారంభించి.. గదులను అందుబాటులోకి తీసుకొని వస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నరసింహారావు, మేరాజ్ ఖాన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వివరిస్తున్న హెచ్‌ఎం

వరదనీరు.. తంటాలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణ పరిధి గ్రీన్‌ఫీల్డ్స్ పరిసర ప్రాంతంలోని నందన్ హోమ్స్‌లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరదనీరు ఇళ్లలోకి చేరింది. నందన్‌హోమ్స్ కాలనీవాసులు రాత్రి నిద్రలేని పరిస్థితి ఎదుర్కొన్నారు. హైడ్రా బృందం కాలనీవాసులు విజ్ఞప్తి మేరకు క్షేత్రస్థాయికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. నందన్‌కాలనీ చుట్టూ ప్రణీత్ గేటెడ్ కమ్యూనిటీ వారు పెద్ద ప్రహరీ నిర్మించడంతో ప్రతిసారి వర్షాకాలంలో ఈ సమస్య పునరావృతమవవుతోంది. గతంలో గోడను కిందిభాగంలో పగలగొట్టి కాల్వను చేయగా అది కుంచుకుపోయింది. దీంతో బీరంగూడలో కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీరు నందన్ హోమ్స్‌లో నిలిచిపోయాయి. ఇళ్లలోకి నీరు వస్తుందని భయాందోళనతో నందమూరి కాలనీవాసులు మంగళవారం రాత్రి మీడియాకు అధికారులకు ఫోన్లు చేసి తమ సమస్యను వివరించారు. అర్ధరాత్రి హైడ్రా సిబ్బంది కాలనీకి చేరుకుని సమస్యకు తాత్కాలికంగా పరిష్కరించారు. శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఇళ్లలోకి చేరిన వరద నీరు

క్లుప్తంగా

డంపింగ్ యార్డుతో ప్రయోజనం

ఎంపీఓ మహేందర్ రెడ్డి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీఓ

కంది(సంగారెడ్డి): డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీఓ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాశీపూర్ డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షానికి మండలంలోని వడ్డెనగూడ తండా, కాశీపూర్ డంపింగ్ యార్డుల పైకప్పు రేకులు ఎగిరిపోయాయన్నారు. తిరిగి రేకులను ఏర్పాటు చేసి డంపింగ్ యార్డులను వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఫ్యాన్ల పంపిణీ



ఫ్యాన్లు అందజేస్తున్న కుల్బానాయక్

కంది(సంగారెడ్డి): కంది మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం మండల ప్రత్యేక అధికారి కుల్బానాయక్ ఆధ్వర్యంలో ఫ్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలన్నింటికీ ఫ్యాన్లు ఏర్పాటు చేయడం వల్ల సౌకర్యంగా ఉంటుందన్నారు. మండలంలోని కేంద్రాలకు ఒకటి చొప్పున ఫ్యాన్లను అందజేస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో అంగన్‌వాడీలకు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, సీడీపీఓ జయరాం, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కానుకుంటలో రైతు సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలోని కానుకుంటలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుముంగిట్లో శాస్త్రవేత్తల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. భూసార పరీక్షలు, వాటి ప్రాముఖ్యలతను వివరించారు. ఎంత మోతాదులో ఎరువులు వాడాలో.. భూసారాన్ని సేంద్రియ విధానాలను పెంచుతూ అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పల్లవి, స్రవంతి, పటాన్‌చెరు ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో చేర్చాలి



ప్రచారంలో మాట్లాడుతున్న నాయకులు

జహీరాబాద్: తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్చాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వైజ్ఞాన మంజరి, జిల్లా కార్యదర్శి బి.సాయిలు మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. నాణ్యమైన, విలువలతో కూడుకున్న విద్యను పొందాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జిల్లా కార్యదర్శులు జగన్మోహన్, శామయ్య, వి.అనురాధ, పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్: యువతి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన యువతి ఈ నెల 27న ఉద్యోగానికి వెళ్తొస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ గోవులను తరలిస్తే చర్యలు

కల్హేర్(నారాయణఖేడ్): బక్రీద్ పండుగ నేపథ్యంలో గోవులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని సిర్గాపూర్ ఎస్ఐ డి.వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతి లేకుండా, ఆధారాలు లేకుండా ఎవరైన గోవులను తరలిస్తే సమాచారం అందించాలన్నారు.

◆ యువతి వివాహానికి సాయం

నారాయణఖేడ్: మండలంలోని హన్మంతరావుపేటకు చెందిన వెంకటేశం, సునీత దంపతులు కుమార్తె వివాహానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. బుధవారం ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ సాగర్, అభిపవార్ బాధితులకు నగదు అందజేశారు.

◆ నీటి వ్యాపారం చేస్తే చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వ్యవసాయ భూముల్లో నీటి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజుల క్రితం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో వ్యవసాయ భూముల్లో నీటి వ్యాపారం చేస్తున్న వారి మోటార్లను సీజ్ చేశామన్నారు. వ్యవసాయ భూముల్లో నీటి వ్యాపారం చేయడం మంచిది కాదన్నారు.

◆ కార్యవర్గ సభ్యుల ప్రమాణం



జహీరాబాద్: పట్టణంలోని సిద్దేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ శివరుద్రప్పల ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం నిర్వహించారు. కొత్తగా ఎన్నికయిన ప్రభాకర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, రమేష్ బాబు, లక్ష్మి, శ్రీనివాస్, అఫిషియల్ సభ్యుడు సంగమేశ్వరస్వామిలు ప్రమాణస్వీకారం చేశారు.

◆ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రారెడ్డినగర్ కాలనీలోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాల్లోని డ్రైనేజీ పైప్‌లైన్‌లు నిండి రోడ్లు జలమయం అయి ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు. త్వరలో డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

◆ నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): 33/11సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గుమ్మడిదల మున్సిపాలిటీలోని బొంతపల్లి, దోమడుగు, అన్నారం, ప్రకృతి నివాస్, నల్లవల్లి. జిన్నారం మండలంలోని సోలక్‌పల్లి, శివానగర్ గ్రామాల్లో ఉ.11 .గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ రవీందర్, వెంకటేశ్వర్లు తెలిపారు. వినియోగదారులు, పారిశ్రామిక యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

◆ నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వట్‌పల్లి (అందోల్): వట్‌పల్లి మండలంలోని రైతులకు ఖాదిరాబాద్ పీఏసీఎస్ కార్యాలయంలో పచ్చిరొట్ట విత్తనాలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై జీలుగ, జనుము విత్తనాలను అందిస్తుందన్నారు. మండలానికి 167 క్వింటాళ్ల జీలుగ, జనుములు 200 బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు భూమి పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను వెంట తీసుకురావాలన్నారు.

◆ ముగిసిన కుటుంబ కూడికలు

రాయికోడ్(అందోల్): మండలంలోని పీపడ్‌పల్లిలోని మెథడిస్ట్ చర్చిలో కుటుంబ ఆశీర్వాద కూడికల దైవకార్యక్రమాలు బుధవారం ముగిశాయి. భక్తులు దైవజనుల బోధనలను ఆలకించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి దైవజనుల బోధనలు విన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

◆ ఘనంగా నవగ్రహాల ప్రతిష్ఠాపన

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని రామలింగేశ్వర ఆలయం ఆవరణలో బుధవారం నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన హోమాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నాం నవగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విగ్రహాలను దర్శించుకున్నారు.

◆ మార్డి పెద్దచెరువు సంరక్షణ చర్యలు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు కబ్జా కాకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నీటి పారుదల శాఖ ఏఈ అలేఖ్యరెడ్డి ఆధ్వర్యంలో చెరువు విస్తీర్ణం గుర్తించేందుకు సర్వే చేశారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

◆ సమస్యలుంటే సమాచారం ఇవ్వండి

పటాన్‌చెరు టౌన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాలనీలో ఏమైనా సమస్యలుంటే తనకు సమాచారం ఇవ్వాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శాంతినగర్, వెంకటేశ్వర కాలనీ, లక్కదొడ్డి కాలనీల్లో పర్యటించారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లపై నిలిచిన వర్షం నీరు, డ్రైనేజీని కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది.. అదేవిధంగా మాన్సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

◆ గడ్డి మందు పిచికారీ తప్పనిసరి

మునిపల్లి(అందోల్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఆయా గ్రామాల్లో పత్తి విత్తనాలు నాటి పత్తి చేనులో గడ్డి మొలవకుండా గడ్డి మందు పిచికారీ చేస్తున్నారు. బుధవారం మండలంలోని పెద్దలోడి, పిల్లోడి, తాటిపల్లి గ్రామాల్లో పత్తి విత్తనాలు రెండు రోజుల నుంచి నాటుతున్నారు. విత్తనాలు నాటిన రోజు, మరుసటి రోజు గడ్డి మందును రైతులు పిచికారీ చేస్తున్నారు. ఒక లీటర్ గడ్డి మందుకు రూ.450 నుంచి రూ 500 చొప్పున ఆయా ఫర్టిలైజర్ షాపుల నుంచి తీసుకుని కూలీలతో పత్తి చేలో పిచికారీ చేస్తున్నారు.

◆ జాతీయ స్థాయిలో రాణించాలి

మునిపల్లి(అందోల్): క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చంటి రాహుల్ కిరణ్ అన్నారు. మండలంలోని పెద్దగోపులారం శివారులో 30 రోజుల నుంచి కేసీఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. బుధవారం ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఇందులో మొదటి బహుమతి పొందిన బుదేరా జట్టుకు రూ.50 వేలు, రెండవ బహు మతి పొందిన పెద్దగోపులారం జట్టుకు రూ.30 వేల చొప్పున నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు.